క్లుప్తంగా

పరీక్షలంటే సానుకూల దృక్పథం అలవర్చుకోవాలి

అయినవిల్లి: విద్యార్థులు పరీక్షలంటే ఒక సానుకూల దృక్పథం అలవర్చుకోవాలని సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. శనివారం మండలంలోని ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాలలలో కోనసీమ సైన్స్ పరిషత్ 2845 మహాసభకు సర్వేశ్వరశర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష ఒక భయంకరమైన ప్రక్రియ కాదన్నారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు ర్యాంకులు, మంచి మార్కులు ఎలా సాధించవచ్చో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్‌వీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



పాఠశాలకు అందజేసిన కుర్చీలు

సఖినేటిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు టేకిశెట్టిపాలెంకు చెందిన శిరిగినీడి వెంకటరమణ దంపతులు రూ.30 వేలు విలువైన 50 కుర్చీలను శనివారం బహూకరించారు. కుమారుడు కిరణ్ జ్ఞాపకార్థం ఈ మేరకు వీటిని హెచ్‌ఎం నరహర శెట్టి సత్యనారాయణకు వారు అందజేశారు. పదో తరగతి విద్యార్థులు స్టడీ అవర్స్‌లో కూర్చొని చదువుకునే నిమిత్తం వీటిని అందజేసినట్టు వెంకట రమణ తెలిపారు. ఈ సందర్భంగా దాత వెంకటరమణ దంపతులను హెచ్‌ఎం సత్యనారాయణ, హిందీ టీచర్ రజియాభానులు శాలువాతో ఘనంగా సత్కరించారు. పాఠశాల తరుపున ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణమూర్తి సేవలు మరువలేనివి

అంబాజీపేట: చిరతపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు లుటుకుర్తి నారాయణమూర్తి రైతులకు చేసిన సేవలు మరువలేనివని సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి ఏడుకొండలు, సర్పంచ్ కోట బేబీరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజులు అన్నారు. చిరతపూడి సొసైటీ వద్ద అకాల మృతి చెందిన నారాయణమూర్తి సంతాప సభను శనివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 1966 నుంచి 1984 వరకు ఏకగ్రీవంగా, 1991-94 వరకు సొసైటీ అధ్యక్షుడిగా 21 ఏళ్లు పదవి చేపట్టారన్నారు. చిట్టిచెరువుగట్టు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలకు 20 సెంట్ల భూమి విరాళంగా ఇచ్చారన్నారు. సొసైటీ, గ్రామాభివృద్ధికి, రైతులకు అందించిన సహకారం, ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. సభలో వార చిట్టిబాబు, కుంపట్ల శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి నల్లా చారిటబుల్ ట్రస్టు ద్వారా శనివారం సహాయం అందించారు. బుంగ నాగమ్మ కుటుంబానికి రూ.2 వేల ఆర్థిక సాయంతో పాటు బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు ట్రస్టు చైర్మన్ నల్లా పవన్ చేతుల మీదుగా అందజేశారు. పవన్ మాట్లాడుతూ నల్లా పవన్ ట్రస్టు ద్వారా పేదలకు సేవలందిస్తున్నామన్నారు. ఈ ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడేపల్లి చిన్న, స్థానికులు కంకిపాటి వెంకటేశ్వరరావు, తులా గోపాలకృష్ణ, గెడ్డం వెంకటేశ్వరరావు, తులా బ్రహ్మజీ, బొలిశెట్టి శివ, కామిశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే రోటరీ లక్ష్యం

రాజోలు: పోలియో రహిత సమాజమే రోటరీ లక్ష్యమని రోటరీ క్లబ్ గవర్నర్ వి.భాస్కర్‌రామ్ అన్నారు. రాజోలు రోటరీ క్లబ్ సమవేశ మందిరంలో రాజోలు, మలికిపురం, అమలాపురం, ముమ్మిడివరం మండలాల రోటరీ క్లబ్‌ల కార్యవర్గంతో ఆయన సమావేశమయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా గత 35 ఏళ్లుగా పోలియో నిర్మూలన కోసం రోటరీ ఎనలేని కృషి చేసిందన్నారు. సుమారు 200 దేశాల్లో పోలియో వ్యాక్సిన్ల కోసం రూ.40 వేల కోట్లు వినియోగించిందన్నారు. అసిస్టెంట్ గవర్నర్ మొహిద్దీన్ కిష్వర్, రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు దార్ల పెదబాబు, కార్యదర్శి లక్కింశెట్టి చిన్మయుడు, నామన షణ్ముఖేశ్వరరావు, కాసు శ్రీనివాస్, బోళ్ల శ్రీనివాస్, నార్కెడిమిల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, అట్టల పంపిణీ

పి.గన్నవరం: నరేంద్రపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఓఎన్‌జీసీ ఎస్సీ, ఎస్టీ ఆల్ ఇండియా ఎంప్లాయిస్ మాజీ చైర్మన్ అంబటి సత్యనారాయణ ఆర్థిక సాయంతో జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పుస్తకాలు, అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల అధ్యాపక సిబ్బంది సత్యనారాయణను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్, జనని ఫౌండేషన్ చైర్మన్ సరెళ్ల ప్రసాద్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వెండి ఢమరుకం సమర్పణ

పి.గన్నవరం: లంకల గన్నవరంలో వేంచేసిన మహాలక్ష్మి అమ్మవారికి గ్రామానికి చెందిన అర్థాని పెద నర్సింహమూర్తి, మంగాయమ్మ దంపతులు, వారి కుమారుడు పాండురంగ స్వామి శనివారం వెండి ఢమరుకాన్ని సమర్పించారు. ఈసందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న ఆసరా

- ద్వాక్రా మహిళలకు తీపికబురు
- మూడో విడత నగదు ఖాతాల్లో జమ
- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



రావులపాలెంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, డ్వాక్రా మహిళలు

రావులపాలెం: డ్వాక్రా మహిళలకు సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు మూడో విడత వైఎస్సార్ ఆసరాను మహిళల ఖాతాల్లోకి వేసినట్టు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పోతంశెట్టి రామిరెడ్డి పార్క్ వద్ద జరిగిన కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం నిధుల విడుదల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్లలోనే 98.5 శాతం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం తమదేనని, ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చెప్పింది చేసి చూపించే చేతల ప్రభుత్వమన్నారు. 2019 ఎన్నికల నాటికి పొదుపు సంఘాల మహిళల పేరిట ఉండే రుణాల మొత్తాన్ని నాలుగు దఫాల్లో నేరుగా వారి చేతికే అందిస్తానని ఇచ్చిన మాటను అమలు చేస్తున్నామన్నారు. ఇది అక్క చెల్లెమ్మలకు జగనన్న ఆసరా అని జగ్గిరెడ్డి గుర్తుచేశారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలసి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి క్షీరాభిషేకం చేశారు. అలాగే మండలానికి చెందిన ఆసరా నమూనా చెక్కును వారికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణి కుమారి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, ఆర్‌డీఓ ముక్కంటి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సెక్రటరీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

అంబాజీపేట: డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తీపి కబురందించారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత నిధులు జమ చేయడంతో మహిళలు ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాలోని 11 మండలాల్లోను 15,255 గ్రూపులకు గాను, రూ.131.06 కోట్లు అక్కచెల్లెమ్మలకు మూడో విడత ఇవ్వనున్నారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 5 వరకు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించి సంబరాలను జరపనున్నారు. సీఎం వైఎస్ జగన్‌కి రుణపడి ఉంటామంటూ వారు వాపోతున్నారు. 2019లో సీఎంగా జగన్ బాధ్యతలు స్వీకరించాక అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచారు. చంద్రబాబు పుణ్యాన నిర్వీర్యదశకు చేరిన డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. వైఎస్సార్ ఆసరా పథకం అమలుతో కొండంత భరోసానిచ్చారు. మొదటి రెండు విడతల్లో నగదు జమ పూర్తయింది. ఇప్పుడు మూడు విడత పూర్తి చేసి వచ్చే ఏడాది నాలుగో విడత సాయం అందించి పూర్తి రుణమాఫీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మూడో విడత ఆసరా చెల్లించేందుకు లబ్ధిదారుల బయోమెట్రిక్‌ల సేకరణ ప్రక్రియ పూర్తయింది.

గ్రూపులు వారీగా...

మామిడికుదురు మండలంలో 1294 గ్రూపులకు రూ.10.12 కోట్లు, అయినవిల్లి మండలంలో 1369 గ్రూపులకు రూ.10.98 కోట్లు, అంబాజీపేట మండలంలో 1285 గ్రూపులకు రూ.9.67 కోట్లు, పి.గన్నవరం మండలంలో 1515 గ్రూపులకు రూ.11.80 కోట్లు, కొత్తపేట మండలంలో 1672 గ్రూపులకు రూ.15.85 కోట్లు, ఆత్రేయపురం మండలంలో 1355 గ్రూపులకు రూ.10.23 కోట్లు, ఆలమూరు మండలంలో 1652 గ్రూపులకు రూ.15.00 కోట్లు, రావులపాలెం మండలంలో 1618 గ్రూపులకు రూ.13.68 కోట్లు, రాజోలు మండలంలో 1316 గ్రూపులకు రూ.11.50 కోట్లు, మల్కిపురం మండలంలో 1385 గ్రూపులకు రూ.12.34 కోట్లు, సఖినేటిపల్లి మండలంలో 1244 గ్రూపులకు రూ.9.39 కోట్లు మంజూరయ్యాయి. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మూడో విడత మాఫీ సొమ్ములను విడుదల చేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

వైఎస్సార్ ఆసరా మూడో విడతతో మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో వైకేపీ ఏపీఎం గంగాధర్ అధ్యక్షతన డ్వాక్రా యానిమేటర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మండల స్థాయిలో ఈ నెల 29 స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. అందుకు గాను యానిమేటర్లు డ్వాక్రా సంఘాలను అధిక సంఖ్యలో తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమానికి పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొనున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. సమావేశంలో డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

మహిళలకు ఎంతో మేలు



ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని మూడవ విడత మాఫీ జమ చేసినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ పథకం మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతో మేలు చేస్తుంది.

– కుసుమ వరలక్ష్మి, డ్వాక్రా మహిళ, మాచవరం

అర్హులందరికీ వర్తింపు



డ్వాక్రా సంఘాల్లో ఉన్న అర్హులైన మహిళలందరికీ వైఎస్సార్ ఆసరా పథకాన్ని వర్తింపజేశాం. ఈ పథకంలో డ్వాక్రా మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతుంది. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో ఆసరా పథకాన్ని వర్తింపజేయనున్నారు.

– ఆర్‌ఎండీ గంగాధర్, వైఎస్సార్ క్రాంతి పథం, ఏపీఎం, అంబాజీపేట

ఇకపై అన్నీ మంచి శకునాలే..

- అయినవిల్లి, చింతలపల్లిలో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు కొండేటి, రాపాక



చింతలపల్లిలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



అయినవిల్లి సచివాలయం-1లో గ్రామంలో గడపగడపలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్ని మంచి శకునాలేనని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శనివారం అయినవిల్లి మండలం అయినవిల్లి సచివాలయం -1పరిధిలో ఎమ్మెల్యే చిట్టిబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గడపలకు తిరిగి గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో రహదారులు నిర్మించాలని, ఇంటి నిర్మాణం కోసం రుణాలివ్వాలని ఇలా పలు సమస్యలను ఎమ్మెల్యే చిట్టిబాబు దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, స్థానిక సర్పంచ్ కాకర శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చిన్నిబాబు, బొంతు రాజేంద్రప్రసాద్, నంబూరి రాంబాబు, మట్టపర్తి వెంకటరమణ, నంబూరి వెంకటరమణరాజు, గుత్తుల నాగబాబు, కుసుమ లిల్లీ మంగేష్కర్, వార లక్ష్మీనరసింహరామ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే రాపాక

రాజోలు: ఎటువంటి తారతమ్యాలు చూడకుండా రాష్ట్రంలో అర్హులైన వారందరికీ నేరుగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం చింతలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులకు వివరించారు. అలాగే గ్రామంలో అర్హులైన వారు ఇంకా ఉండిపోతే అక్కడికక్కడే అధికారులకు వాటి అమలుకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీని కలసిన పాశర్లపూడి నిర్వాసితులు



నిర్వాసితుల సమస్యపై అధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న ఎంపీ అనురాధ

మామిడికుదురు: 216వ నంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇళ్లతో పాటు భూములు కోల్పోతున్న పాశర్లపూడికి చెందిన నిర్వాసితులు శనివారం అమలాపురం ఎంపీ చింతా అనురాధను కలసి వినతిపత్రం ఇచ్చారు. అల్లవరం మండలం మొగళ్లమూరులో ఎంపీని ఆమె నివాసంలో కలిసి విజ్ఞాపన పత్రం అందించారు. జాతీయ రహదారుల విభాగం అధికారులు తమపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని వాపోయారు. కొందరికి చదరపు గజాల్లోను, మరి కొందరికి ఎకరాల్లోను పరిహారం నిర్ణయించారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు చదరపు గజాల్లో పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసు బందోబస్తుతో తమ ఇళ్లను తొలగిస్తామని తమను బెదిరిస్తున్నారన్నారు. చదరపు గజాల్లో పరిహారం అందించి తమను ఆదుకోవాలని ఎంపీని కోరారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఎంపీ అనురాధ తమకు అభయమిచ్చారని చెప్పారు. అక్కడి నుంచే సెల్‌ఫోన్లో సంబంధిత అధికారులతో మాట్లాడారని చెప్పారు. ఎంపీని కలిసిన వారిలో కశిలంక సత్యనారాయణ, గంధం మాణిక్యం, గంధం లక్ష్మణరావు, గెడ్డం గంగాధర్, చొల్లంగి ధర్మరాజు, తోట నాగేశ్వరరావు, వాకపల్లి శ్రీనివాస్, జి.శ్రీనివాసరావు ఉన్నారు.

నూరు శాతం మార్కులు సాధించాలి



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సరస్వతీ దేవి పూజలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు

అంబాజీపేట: ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషి, సరస్వతి దేవి అనుగ్రహంతో పదో తరగతిలో నూరు శాతం మార్కులు సాధించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం బీర హనుమంతరావు అధ్వర్యంలో సరస్వతీ దేవి పూజను శనివారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఈ పూజలను వైభవంగా జరిపారు. స్థానిక పాఠశాలలో ఉన్న సరస్వతీదేవి విగ్రహం ముందు పరీక్ష అట్టలు, పెన్నులను ఉంచి భక్తిశ్రద్ధలతో కొలిచారు. సరస్వతీదేవి విగ్రహదాత మాజీ సర్పంచ్ కొర్లపాటి సుబ్రహ్మణ్యవరప్రసాద్‌రావు కుమారుడు కోటబాబు పర్యవేక్షణలో అర్చకులు ఈ పూజలను నిర్వహించారు. అనంతరం ఎంపీపీ వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కోటబాబు సమకూర్చిన పెన్నులను పూజలో ఉంచి 130 విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ అరిగెల రామతులసి, సూదాబత్తుల రాము, కామిశెట్టి మధుబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు నలుగురు విద్యార్థుల ఎంపిక



షేక్ హసీనా బేగం



చోడే శృతి



చోడే సత్యస్వరూప

అంబాజీపేట: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు నలుగురు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎంలు బీర హనుమంతరావు, ఏవీఎల్‌వీ ప్రసాద్, వై.ఝాన్సీ నాగజ్యోతి శనివారం తెలిపారు. అంబాజీపేటలో పెచ్చెట్టి రోహిత్, మాచగిరి తేజస్విని, పుల్లేటికుర్రులో బొక్కా లోకేష్‌సత్యశ్రీనివాస్, గంగలకుర్రులో రావి శైలజ అన్నపూర్ణ ఎంపికయ్యారన్నారు. వీరికి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.1,200 చొప్పున పారితోషికం ప్రభుత్వం అందిస్తుందన్నారు. మెరిట్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఆయా పాఠశాలల పీఎంసీ చైర్మన్‌లు, ఉపాధ్యాయులు అభినందించారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: 2022–23 సంవత్సరానికి సంబంధించి నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు అయినవిల్లి మండలం చింతనలంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీవీ రవిప్రసాద్ శనివారం తెలిపారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న చోడే శృతి, చోడే సత్యస్వరూప, షేక్ హసీనాబేగం అర్హత సాధించారు. వీరికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేస్తుందన్నారు. గతంలో కూడా పాఠశాల నుంచి 16 మంది దీనికి అర్హత సాధించారని రవి తెలిపారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వేయి నామాలవాడ.. వేంకటేశుడా..



వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సినీనటుడు ఆకాష్

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. కొత్త గుడితో పాటు పాత గుడి వద్ద స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉభయ దేవేరులతో కొలువు తీరిన స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామికి వివిధ సేవల ద్వారా రూ.1.92 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాద, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.1.29 లక్షల ఆదాయం రాగా నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.62,634 విరాళాలు అందించారు. 2,857 మంది భక్తులు స్వామి వారి దర్శించుకున్నారు. 2,309 మంది భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. ఈవో ఎంకేటీ నాగ వరప్రసాద్, చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు, ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేంకటేశుని సన్నిధిలో హీరో ఆకాష్

ఆత్రేయపురం: మండలంలోని వాడపల్లిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామిని సినీ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తనయుడు సినీనటుడు ఆకాష్ శనివారం దర్శించుకున్నారు. దేవదాయశాఖ సాదర స్వాగతం పలకగా ఆయన వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ ఆలయాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు.

నేటి నుంచి శ్రీరామ సప్తాహం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో నూతనంగా నిర్మించిన పట్టాభి రామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం నుంచి శ్రీరామ సప్తాహం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈనెల 26న ప్రారంభమై ఏప్రిల్ 2న ఈ సప్తాహం ముగియనుందన్నారు. ఈనెల 30న శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో దేవతా మూర్తుల విగ్రహాలకు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన భజన బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తి కీర్తనలు ఆలపిస్తారని వారు పేర్కొన్నారు.

శారీరక దారుఢ్యానికి క్రీడలు అవసరం

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు, మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.సురేష్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఇన్‌చార్జి హెచ్‌ఎం వి.సత్యనారాయణ అధ్యక్షతన విద్యార్థులకు తైక్వాండో సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సీనియర్ తైక్వాండో కోచ్ పితాని త్రిమూర్తులు తైక్వాండో బాలిక క్రీడాకారులకు ఆత్మరక్షణపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కామిశెట్టి మధుబాబు, ఎం.ఎన్.శ్రీనివాస్, భీమేష్, బి.వెంకటేశ్వరరావు, కామేష్, పి.లక్ష్మీభార్గవి తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రానికి శనివారం ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. వివిధ రూపాల్లో టిక్కెట్ల ద్వారా రూ.1,37,878 ఆదాయం, అన్నప్రసాదం విరాళం రూపంలో రూ.17,223 వచ్చినట్టు ఈఓ సింగం రాధ తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ

అంబాజీపేట: రామ్‌చరణ్ పుట్టినరోజు వారోత్సవాలను పురస్కరించుకుని కోనసీమ రామచరణ్ యువశక్తి ఇన్‌చార్జి మంచాల నోకేష్ ఆధ్వర్యంలో మాచవరం ప్రాథమిక పాఠశాలలో నోట్ పుస్తరాలు, పెన్నులు, బిస్కట్‌లను విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. సుమారు 60 మంది విద్యార్థులకు పుస్తకాలు అందించినట్లు నోకేష్ తెలిపారు.

సంపూర్ణ శ్రీమద్రామాయణ ప్రవచనాలు



ప్రవచనాలు వివరిస్తున్న సీతారామశర్మ

కొత్తపేట: స్థానిక హరిహర దేవాలయ ప్రాంగణంలో యువ వేదపండితుడు దెందులూరి సీతారామశర్మ ‘సంపూర్ణ శ్రీమద్రామాయణం’ పురాణ ప్రవచనాలు కార్యక్రమాన్ని 42 రోజుల పాటు ప్రతిరోజూ రాత్రి నిర్వహిస్తున్నారు. ఈ నెల 23 నుంచి దీనిని ప్రారంభించారు. ఉమాకొప్పేశ్వర పురాణ ప్రవచన కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ సీతారామశర్మ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు సలాది రామమోహనరావు (చిన్ని) పర్యవేక్షణలో భక్తుల సహకారంతో ఏర్పాటు చేశారు. భక్త రామదాసు మేనమామలైన అక్కన్న, మాదన్నలు నిర్మించిన హరిహరదేవాలయ ప్రాంగణంలో మే నెల 3 వరకూ 42 రోజులు పాటు ప్రతీ రోజు సాయంతంరం 6.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకూ సీతారామశర్మ ఒక్కో రోజు రాత్రి ఒక్కో అంశంగా ‘సంపూర్ణ శ్రీమద్రామాయణం’ ప్రవచనాలు చెబుతారు. 42వ రోజు సీతారామచంద్రస్వామివారి కల్యాణోత్సవం, పట్టాభిషేకం, ఫలశృతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొత్తపేట పరిసర గ్రామాల భక్తులు రామకార్యానికి తమ వంతు సమయాన్ని వెచ్చించి రామకథా శ్రవణాన్ని చేసి పునీతులు కావాలని కోరారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా బిల్లు చరిత్రాత్మకం

కొత్తపేట: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే దిశగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం ఒక చరిత్రాత్మక నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ (ఏపీబీసీ) చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ అన్నారు. మండలంలోని వాడపాలెం ప్రేయర్ పవర్ చర్చ్‌లో శనివారం బిషప్స్ కౌన్సిల్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఏపీబీసీ జిల్లా అధ్యక్షుడు బిషప్ అడపా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్ డాక్టర్ ప్రవీణ్, అధ్యక్షుడు బిషప్ బాలరాజు, ప్రధాన కార్యదర్శి బిషప్ వానాల డేవిడ్‌రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ శుక్రవారం అసెంబ్లీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా బిల్లును ప్రతిపాదించడం ఒక చారిత్రాత్మక నిర్ణయం కాగా శాసనసభ మొత్తం ఏకగ్రీవంగా ఆమోదించడం అభినందనీయమన్నారు. ‘కులం పుట్టుకతో వస్తుంది’ ‘మతం మధ్యలో వస్తుంది’ అని గుర్తించి అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి, సుప్రీంకోర్టులో కేసుకు సంబంధించి ప్రభుత్వం తరపున ఇంప్లీడ్ అయ్యి వాదనలు వినిపిస్తామనడంపై క్రైస్తవలోకం మొత్తం సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు. ఈ బిల్లు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ మేలును ఏ దళిత క్రైస్తవుడు మరువడని అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ మెంబర్ ఆర్చ్ బిషప్ జె.జార్జ్ పాపన్, బిషప్ కౌన్సిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని మోదుకూరులో ఉపాధి కూలీ నేతల యేసురత్నం (54) పని చేస్తూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను ఫీల్డ్ అసిస్టెంట్ నల్లి రాజు, సర్పంచ్ పెంటపాటి శ్యామలను అడిగి తెలుసుకున్నారు. పంటకాలువలో పూడికతీత పనులు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి పోయి నీటిలో పడిపోయాడని వారు వివరించారు. అంతలో పక్కనే ఉన్న కూలీలు వచ్చి సహాయక చర్యలు చేపట్టినా అప్పటికే మృతి చెందిన విషయాన్ని తెలియజేశారు. ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి సహకారంతో యేసురత్నం మృతదేహాన్ని చిర్ల సోమసుందరరెడ్డి ఫౌండేషన్‌కు చెందిన అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడు యేసురత్నం నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి వ్యక్తిగత సాయంగా రూ.20 వేలు ఆ కుటుంబానికి అందించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటానని ప్రభుత్వ పరంగా సాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఎస్సై ఎస్.శివప్రసాద్, పెంటపాటి వెంకట్రావు, ఆకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.